

మట్టి గణపతుల తయారీలో పాల్గొన్న విద్యార్థులు

## మట్టి గణపతుల తయారీలో పోటీలు

బేగంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ మోడల్‌కాలనీలో సనాతన ధర్మబాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం విద్యార్థినీ విద్యార్థులకు మట్టి గణపతి తయారీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని మట్టి గణపతులను తయారు చేసి, వాటికి సహజ రంగులను అద్దారు. ఈ సందర్భంగా సమితి సభ్యుడు బుచ్చిబాబు మాట్లాడుతూ, పిల్లల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు భగవంతునిపై భక్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. పోటీల్లో పాల్గొన్న పిల్లల్లో పది సంవత్సరాల పైబడిన వారు ముగ్గురు, అంతకంటే వయస్సు తక్కువగా ఉన్న వారిలో ముగ్గురిని ఎంపిక చేసి వారికి నగదు బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలకు మట్టిగణపతులను, జూట్ బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు.



ఓటు చోరీ యాత్రను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్ రెడ్డి

## 'ఓటు చోరీ యాత్ర'కు మద్దతుగా..

యూసుఫ్ గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బీహార్ లో చేపట్టిన 16 రోజులు 1300 కిలోమీటర్ 'ఓటు చోరీ యాత్ర'కు మద్దతుగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్ రెడ్డి ఓటు చోరీ యాత్రను కృష్ణానగర్ లేబర్ అడ్డా నుంచి కొబ్బరి కాయలు కొట్టి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో ఓటు చోరీ యాత్ర నాలుగు రోజులు నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రకు ఆయా రాష్ట్రాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంజయ్, లక్ష్మీరెడ్డి, సాదిరెడ్డి, రాధిక తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మైత్రీవనం వద్ద వ్యర్థాల తొలగింపు ప్రారంభం



మైత్రీవనం చౌరస్తా సమీపంలో నాలా నుంచి తీస్తున్న వ్యర్థాలు

వెంగళరావునగర్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): నగరంలో భారీ వర్షం పడితే అమీర్‌పేట్ మైత్రీవనం వద్ద రహదారిపైన నడుము లోతు వర్షం నీరు నిలవడమే కాకుండా తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. సమీపంలోని దుకాణాలు, ఇళ్లలోకి వర్షం నీరు చేరుతుంది. భారీ వర్షం పడితే స్థానికులు ఆందోళన చెందడం పరిపాటిగా మారింది. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులతో కలిసి పర్యటించారు. సీఎం ఆదేశాల మేరకు వర్షం వస్తే ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమీర్‌పేట్ ప్రధాన రహదారి వెస్ట్ శ్రీనివాస నగర్ కాలనీలోని మైత్రివనం బస్టాప్ వద్ద బాక్స్ టైప్ నాలా, డ్రైనేజీ నుంచి ఆదివారం వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు.

## ముంపు విషయంలో చర్యలు తీసుకోండి

### హైడ్రా కమిషనర్‌కు కార్పొరేటర్ సంగీత వినతి

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ముంపు విషయంలో కారణాలు విశ్లేషించి వెంటనే చర్యలు తీసుకోవాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో అమీర్‌పేట చుట్టు పక్కల బస్తీలు నాలా పొంగి ముంపునకు గురయ్యాయన్నారు. హైడ్రాతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ముంపు ప్రాంతాలను పరిశీలించారని వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

## బస్తీల అభివృద్ధికి అధిక నిధులు : రామిరెడ్డి

బోరబండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బస్తీల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్ బస్తీలలో రహ్మత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ బూత్ కమిటీ కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆయన పాదయాత్ర చేశారు. ఇప్పటికే ఈ డివిజన్‌లో రూ.30 కోట్లతో వివిధ పనులు జరిగాయని, రూ.20 కోట్లతో త్వరలో మరిన్ని పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పార్టీలో సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందని భరోసా కల్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కచ్చితంగా విజయం సాధిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు.

## చిన్నారులకు క్రీడలపై ఆసక్తిని పెంచాలి

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచడానికి తల్లిదండ్రులు కృషి చేయాలని రాజీవ్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ అన్నారు. ఇందులో భాగంగా ఆదివారం చిన్నారులకు పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం కాలనీలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా చిన్నారులకు, స్కూల్, కాలేజీ విద్యార్థులకు క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

బంజారాహిల్స్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. వారం వారం పూలహారంలో భాగంగా 143వ వారం ఫిలింనగర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి హైకోర్టు న్యాయవాదులు కాదారి రమేష్, రవి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ బీసీ సంఘం అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, మాలవెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి తులసి రాజలింగం, గ్రేటర్ అధ్యక్షుడు బత్తుల మధుసూదన్ పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 5 దేవరకొండ బస్తీలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు బాలాజీ గోస్వామి అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.



ఉత్సవాలకు హాజరు కావాలని మల్కాజ్‌గిరి ఎంపీ బీజేపీ నేత ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

- ఖైరతాబాద్, (ఆంధ్రజ్యోతి)

# శిథిలావస్థలో కాలనీ రోడ్లు..!

### అడుగడుగునా గుంతలు.. బంజారాహిల్స్‌లో వాహనదారుల పాట్లు



బంజారాహిల్స్ ప్యూరో నేచురల్ ఎదురుగా వద్ద శిథిలావస్థకు చేరిన రోడ్డు



ఈ సేవ ఎదుట కొట్టుకుపోయిన రోడ్డు



జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 25లో దెబ్బతిన్న రోడ్డు



బంజారాహిల్స్ రోడ్డు నంబరు 14 భాగ్యనగర్ స్టూడియో దారిలో గోతులు పడ్డ రోడ్డు



ఫిలింనగర్ చౌరస్తాలో ఎగుడుదిగుడుగా మ్యాన్‌హోల్ మూతలు

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ధనవంతుల కాలనీలో ప్రధాన రోడ్లతో పాటు, అంతర్గత దారులు శిథిలావస్థకు చేరాయి. అంతంత మాత్రమే ఉన్న రోడ్లు వరుస వర్షాలకు గోతులమయంగా మారాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. బంజారాహిల్స్ పోలీసుస్టేషన్ నుంచి రోడ్డు నంబర్ 7 మీదుగా రోడ్డు నెంబర్ 10 వరకు వెళ్లే దారిలో అడుగడుగునా రోడ్డు గోతులతో నిండిపోయింది. ముఖ్యంగా ఈ-సేవ, ప్యూరో నేచురల్ ఎదురుగా మూడు ఫీట్ల లోతు గోతులు ఏర్పడ్డాయి. వీటిలో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులకు గోతులు కనిపించకపోవడంతో వాటిలో పడిపోతున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్14లో జూడేస్ ఎదురుగా రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. ఓ వైపు కొత్త రోడ్డు వేస్తున్న జీహెచ్ఎంసీ మరోవైపు ఉన్న గోతులను పూడ్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. జూబ్లీహిల్స్‌లోని కాలనీ రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం కనీసం పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## ఆందోళన వద్దు.. పరిష్కారం ఉంది

### రుమటైడ్ వ్యాధిగ్రస్తులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



రాజగోపాల రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న వైద్యులు

హైటెక్స్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రుమటైడ్ ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి నిర్ధారణతో పాటు చికిత్సలో అధునాతన టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సౌత్ జోన్ ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ (స్రిజికాన్) 2025 ఆధ్వర్యంలో ఆదివారం నోవాటెల్‌లో డాక్టర్ విజయ ప్రసన్న నిర్వహించిన పేషెంట్ సపోర్ట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ వలన ఎవరూ బాధ పడవద్దని, పాజిటివ్ థింకింగ్‌తో ముందుకు సాగాలన్నారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని ధైర్యం చెప్పారు. ఒకప్పుడు క్యాన్సర్ వస్తే చనిపోయే వారని, అంతటి ప్రాణాంతక వ్యాధులకు కూడా ఇప్పుడు అధునాతన వైద్యసౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. 'నా తల్లి కోమటిరెడ్డి సుశీల పేరుతో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి రోగులకు సహాయం అందిస్తున్నా'నన్నారు. రుమటాలజీ సీనియర్ వైద్యుడు లీజా రాజశేఖర్ మాట్లాడుతూ ఈ వ్యాధుల పట్ల చాలామందికి అవగాహన లేదని ప్రాథమిక దశలోనే గుర్తించి మంచి వైద్యం అందించాలన్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల నుంచి సహకారం కావాలని, ఇన్సూరెన్స్ కంపెనీలు ఇబ్బందులు పెడుతున్నాయని, ప్రభుత్వం ఆయా సంస్థలతో చర్చించాల ని సూచించారు. వ్యాధిగ్రస్తులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను వైద్యులు, ఇన్సూరెన్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పర్యటనలు

### రాష్ట్ర పాడి పరిశ్రమ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి



ఎర్రగడ్డ డివిజన్‌లో పర్యటిస్తున్న గుత్తా అమిత్ రెడ్డి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారమే లక్ష్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటనలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకటరమణా రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అహ్మద్ ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీలల్లో ఆదివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి పర్యటించారు. ప్రేమ్‌నగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్, కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ, సారథి సొసైటీ తదితర బస్తీలలో వారు పర్యటించారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పరిస్థితి, వీధి దీపాలు తదితర సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడానికి కార్యకర్తలు, నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు వారు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవి గౌడ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ మొహమ్మద్ మోహన్ ఖురేషి, కృష్ణ కుమార్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

### రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

వెంగళరావునగర్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలలో అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కళ్యాణ్ నగర్ వెంచర్-1లో వెంగళరావునగర్, మధురానగర్ పరిధిలోని 25 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బుత్‌కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు, అన్వేష్ రెడ్డిలు మాట్లాడుతూ అభ్యర్థి ఎవరైనా పార్టీ విజయం కోసం పని చేయాలని వారు దిశా నిర్దేశం చేశారు. ఉప ఎన్నికలను పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు, మనోజ్ యాదవ్, బోడ రాంచందర్, బూత్ కమిటీ ఇన్‌చార్జీలు, సభ్యులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అంజన్ కుమార్ యాదవ్

## ఎన్నికలప్పుడే రాజకీయాలు.. తర్వాత అభివృద్ధి

### అంజన్ కుమార్ యాదవ్

యూసుఫ్ గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలప్పుడే రాజకీయాలు, ఆ తర్వాత అభివృద్ధి బాటలో పని చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ పార్లమెంట్ సభ్యుడు అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం గణపతి కాంప్లెక్స్, మారుతీనగర్ పార్కులో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మారుతీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి కాలనీలో ప్రధానమైన తాగునీటి సమస్య, 50 ఏళ్ల క్రితం నిర్మించిన భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్‌తో కాలనీ ప్రజలు నిత్యం పడుతున్న ఇబ్బందులను అంజన్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో స్వర్గీయ పీజేఆర్ తో కలిసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని, బస్తీల నిర్మాణానికి కృషి చేశానని తెలిపారు. ఉప ఎన్నికల తరువాత మారుతీ నగర్‌లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మారుతి నగర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు లక్ష్మీకర్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్ తోపాటు కాంగ్రెస్ నాయకులు కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాన్‌హోల్‌లో ప్రైవేటు వ్యక్తితో పనులు.. యజమానిపై కేసు

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మ్యాన్‌హోల్‌లో ప్రైవేటు వ్యక్తిని దించి పనులు చేయించుకోవడంతో ఇంటి యజమానిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్‌నెం 12లోని శ్రీరాంనగర్‌లో నివసిస్తున్న వహాబ్ అనే వ్యక్తి గ్లాస్ ఫిట్టింగ్ పనులు చేస్తుంటాడు. అతడి ఇంటికి 12 ఏళ్లగా సివరేజ్ కనెక్షన్ ఉంది. కొన్నినెలలుగా తరచూ ఇంటి ముందు ఉన్న మ్యాన్ హోల్ పొంగుతోంది. దీంతో పలుమార్లు జలమండలి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 11న మరోసారి ఫిర్యాదు చేశాడు. దాంతో ఈనెల 16న జలమండలి సివరేజ్ క్లీనింగ్ యంత్రంతో వచ్చిన నాగరాజు అనే ఉద్యోగి వహాబ్ ఇంటి వద్ద సమస్యను పరిశీలించాడు. ఇది తమ పనికాదని, వేరే కూలీతో పనులు చేయించు కోవాలని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో ఈనెల 21న లేబర్ అడ్డాకు వెళ్లి ఇద్దరు కూలీలను తెచ్చి తన ఇంటి ముందున్న మ్యాన్‌హోల్‌లో బ్లాకేజీని తొలగింపజేశాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తి మ్యాన్‌హోల్‌లో దిగిన వ్యక్తి ఫొటోను తీసి మరుసటి రోజు ఓ పత్రికలో ప్రచురించడంతో నిబంధనలకు విరుద్ధంగా మ్యాన్‌హోల్‌లో వ్యక్తి దిగడం ప్రమాదకరమని దీనికి కారణమైన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇంటి యజమాని వహాబ్ మీద పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆదివారం నిందితుడికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. జలమండలి సిబ్బంది సూచనతోనే ప్రైవేటు వ్యక్తుల చేత మరమ్మతులు చేయించుకున్నానని, అకారణంగా క్రిమినల్ కేసు పెట్టారంటూ వహాబ్ ఆరోపించాడు.

## తాకట్టు పెట్టుకున్న బంగారంతో ఉడాయింపు

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తాకట్టు పెట్టుకున్న ఆభరణాలతో ఉడాయించిన మార్వాడీ వ్యాపారి ముఖేష్ జైన్‌పై జూబ్లీహిల్స్‌లో మరోకేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణానగర్‌కు చెందిన వీరమణి అనే మహిళ గత ఏడాది ఏప్రిల్‌లో ముఖేష్ జైన్ వద్ద తన 16గ్రాముల బంగారు గొలుసు తాకట్టు పెట్టింది. అక్టోబర్‌లో సైతం 8 గ్రాముల బంగారు కమ్మలు తాకట్టు పెట్టింది. కాగా జూలైలో డబ్బు కట్టేసి వస్తువులు తీసుకునేందుకు వెళ్లగా అప్పటికే జైన్ వ్యాపారం తన బాబాయ్ బాబూలాల్ జైన్‌కు అప్పగించి ఉడాయించాడు. తనకు కేవలం కమ్మల గురించి మాత్రమే తెలుసని, వాటిని మాత్రం తిరిగి ఇచ్చాడు. మిగిలిన గొలుసుతో తనకు సంబంధం లేదంటూ బాబూలాల్ బుకాయించాడు. దీంతో ముఖేష్ జైన్‌తోపాటు బాబూలాల్ తనను మోసం చేశారంటూ బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా ముఖేష్ జైన్ బాధితులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, అతడిని అరెస్ట్ చేసి విచారిస్తే మరిన్ని మోసాలు బయటకు వస్తాయని బాధితులు పేర్కొన్నారు.

## బంగారు గొలుసు మాయం, కేసు నమోదు

అమీర్ పేట ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కారులో బయలుదేరిన మహిళ తన వద్ద ఉన్న రూ. 2 లక్షల విలువ చేసే 2 తులాల బంగారు గొలుసు కనిపించకుండా పోవడంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. దాసారం బస్తీకి చెందిన ప్రశాంతి విప్రో సంస్థలో పనిచేస్తుంది. ఆదివారం ఇంటి నుంచి నడుచుకుంటూ వచ్చి కంపెనీ క్యాబ్ ఎక్కింది. ఆ సమయంలో బంగారు గొలుసును డబ్బాను చేతిలో పట్టుకుని వచ్చింది. కారు దిగిన తరువాత డబ్బాలో గొలుసు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఓయూ క్యారమ్స్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్యారమ్స్ చాంపియన్‌షిప్ ఈనెల 29,30వ తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాలలో ఈ పోటీలు జరగనున్నాయి. మరిన్ని వివరాల కోసం 9849526203 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.



గోపీనాథ్ సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

## మాగంటి ప్రజల మనిషి : మహమూద్ అలీ, తలసాని

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత మాగంటి గోపీనాథ్ సంతాప సభకు వేలాదిగా హాజరైన ప్రజానీకాన్ని చూస్తే మాగంటి ప్రజల మనిషని తెలుస్తుందని ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి అందుకు నిదర్శనమని మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డలోని మెజిస్టిక్ గార్డెన్‌లో మాగంటి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోయే ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి సునీతను గెలిపించి ఆయన రుణం తీర్చుకోవాలి అన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ మామూలు నాయకుడు కాదని రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి ఆయన న్యాయం చేశారని కొనియాడారు అనంతరం మాగంటి గోపీనాథ్ అకాల మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు గౌసుద్దీన్ దేదీప్య, మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, ఎర్రగడ్డ డివిజన్ పార్టీ అధ్యక్షుడు డప్పు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి, నాయకులు సోహెల్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ దిల్‌సుక్‌నగర్ శాఖ అధ్యక్షుడిగా రాజశేఖర్

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ దిల్‌సుక్ నగర్ శాఖ అధ్యక్షుడిగా ఎర్రగడ్డ రాజీవ్ నగర్ కాలనీకి చెందిన లయన్ రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి లయన్ మోహన్ రెడ్డి నియామక పత్రాన్ని రాజశేఖర్‌కు అందజేశారు. లయన్ రాజశేఖర్ మాట్లాడుతూ దిల్‌సుక్ నగర్ శాఖ అధ్యక్షుడిగా పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కమలాకర్, రవీందర్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**నియంత్రణే కాదు.. సేవకులం కూడా**

ఎర్రగడ్డలో ట్రాఫిక్ సేవలు చేయడానికి వచ్చిన పోలీస్ సిబ్బంది.. ఇలా ఒక సీనియర్ సిటిజన్‌ను రోడ్డు దాటిస్తున్న దృశ్యం.



బోర్‌వెల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

**తిరుమలగిరి ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** తిరుమలగిరి వార్డు-7 ఓల్డ్ గాంధీనగర్ సెయింట్ ఆంథోని చర్చ్ సమీపప్రాంత వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ద్వారా వేయిస్తున్న బోరువెల్ పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మెరుగైన వసతుల కల్పనే ప్రధాన లక్ష్యమని, అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇవ్వడానికి సీఎం సిద్ధంగా ఉన్నారని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, రవీందర్ గుప్త, రేమండ్, భవాని, ప్రదీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ డాక్టర్ సామల హేమను సత్కరిస్తున్న సికింద్రాబాద్ ముదిరాజ్ మహాసభ నాయకులు

## కార్పొరేటర్‌కు సత్కారం

**బౌద్ధనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ ముదిరాజ్ మహాసభ సికింద్రాబాద్ కమిటీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నామాలగుండులో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సామల హేమను సత్కరించారు. ఇటీవల ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందినందుకు సామల హేమకు శాలువాలు కప్పి, పూలదండలు వేసి సన్మానం చేశారు. ముదిరాజ్ జాతిలో యువ నాయకురాలిగా ఎదగడం సంతోషంగా ఉందని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ శాఖ కమిటీ నాయకులు యాదగిరి ముదిరాజ్, సతీష్, గౌరీ, గణేశ్, శ్రీను, చిరంజీవి, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుకా నర్మద మల్లికార్జున్

## సమస్యల పరిష్కారానికి కృషి

**మారేడుపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) :** కాలనీల్లో మరిన్ని మెరుగైన వసతులు కల్పించడానికి కృతనిశ్చయంతో పని చేస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుకా నర్మద మల్లికార్జున్ అన్నారు. ఆదివారం బోర్డు ఐదో వార్డు పరిధిలోని రాధిక కాలనీలో రూ.11 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆమె ప్రారంభించారు. కాలనీలో చెట్ల కొమ్మలు ట్రిమ్మింగ్ చేయాలని, అంతర్గత రోడ్లు వేయాలని కాలనీ వాసులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోర్డు పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లోని బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాగా తన దృష్టికి వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ తిలక్ వంశీ, రాధిక కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఉమాశ్రీ, కార్యదర్శి సునీత, ఉపాధ్యక్షులు కేయు ప్రసాద్, కోశాధికారి శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.



వారాసిగూడ చౌరస్తాలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసి సిబ్బంది

## చెట్ల కొమ్మల తొలగింపు

**బౌద్ధనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంతో పాటు ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాల తరుణంలో జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది చెట్ల కొమ్మల తొలగింపును చేపట్టారు. ఆదివారం వారాసిగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండి వరకు ప్రధానరోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీవృక్షాల చెట్ల కొమ్మలను తొలగించారు. దీనివల్ల నిమజ్జనానికి వెళ్లే విగ్రహాలు సులువుగా వెళ్లతాయని అధికారులు తెలిపారు. అంతర్గత రోడ్లలో కూడా చెట్ల కొమ్మలను తొలగిస్తామని వారు తెలిపారు.



రత్నమాల దంపతులను సత్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

## ఆత్మీయ వీడ్కోలు

**చిలకలగూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ నెలఖారుకి పదవీ విరమణ చేయనున్న చీఫ్ ఫార్మాసిస్ట్ రత్నమాలకు ఆదివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్. శ్రీధర్, జోనల్ కార్యదర్శి పి.యుగంధర్‌లు మాట్లాడుతూ కరోనా సమయంలో నగరంలోని 30వేల మంది పెన్షనర్లకు ఇంటింటికీ మందులు అందజేయడంలో కీలకపాత్ర పోషించారని, ఆమె సేవలకి జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయని పేర్కొన్నారు. అనంతరం రత్నమాల దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు సుధాకర్, బాబురావు, నరసింగరావు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టెన్నికాయిట్ కొత్త కార్యవర్గం

## టెన్నికాయిట్ కార్యదర్శిగా వెంకటేష్

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** తెలంగాణ టెన్నికాయిట్ సంఘం కార్యదర్శిగా పీఎన్.వెంకటేష్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన వార్షిక సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాకేష్ అగర్వాల్, వైస్ చైర్మన్‌గా సుశీల్, ఉపాధ్యక్షుడిగా సద్గురు, కోశాధికారిగా రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు తెలంగాణ ఒలింపిక్ సంఘం నుంచి పరిశీలకులుగా శోభన్ హాజరయ్యారు.



చిలకలగూడ మున్సిపల్ మైదానంలో అకీషా ఫౌండేషన్ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు బండపల్లి సతీష్ ఆధ్వర్యంలో భారీ గణనాథుడి మండపానికి ఏర్పాట్లు



వారాసిగూడ గుడ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధమవుతున్న వినాయక మండపం


# గణేష్ ఉత్సవాలకు లష్కర్ ముస్తాబు

### నవరాత్రోత్సవాలకు సిద్ధమవుతున్న మండపాలు



కొలువుదీరేందుకు లష్కర్ వీధుల మీదుగా మండపానికి తరలివెళుతున్న భారీ గణనాథుడు

**సికింద్రాబాద్ జోన్ బృందం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** విఘ్నాల నుంచి గట్టెక్కించాలని, తలపెట్టిన కార్యాలను సఫలీకృతం చేయాలని, తమను, తమ కుటుంబ సభ్యులను చల్లగా చూడాలంటూ వినాయకునికి పూజలు చేసేందుకు భక్తజనం సిద్ధమవుతున్నారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా, అన్ని వర్గాల ప్రజలు వినాయక ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అటు నగరంలో మత సామరస్యతకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలకు లష్కర్ ముస్తాబవుతోంది. ప్రధాన కూడళ్లు, అంతర్గత రోడ్లు, కాలనీలు, బస్తీలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కుల సంఘాలు, యువజన మండళ్లలో గణేశుని ప్రతిష్ఠించేందుకు చురుగ్గా సన్నాహాలు సాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ నాయకులు, స్వచ్ఛంద, సేవా సంస్థలు, భక్తజన మండళ్లు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా గణేష్ నవరాత్రోత్సవాల కోసం వినాయక మండపాలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లలోని ఏ వీధి చూసినా వినాయక మండపాల ఏర్పాట్లతో కళకళలాడుతోంది.



బోయినపల్లిలో రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ముస్తాబవుతున్న గణేష్ మండపం

## మాతృభాషను గౌరవించండి

**మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**మారేడుపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) :** మాతృభాషకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని హర్యాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. ఆదివారం మారేడ్‌పల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో జేసీఐ సికింద్రాబాద్, సికింద్రాబాద్ జూనియర్ ఛాంబర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో మెరిట్‌తో ఉత్తీర్ణత సాధించిన వందమంది విద్యార్థులకు రూ.3000 చొప్పున ఆయన కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి(సోల్కాస్టిక్ ఆనర్స్) స్కాలర్‌షిప్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివితే దేశం సుభిక్షంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే కాలానుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త సాంకేతిక కోర్సుల్లో శిక్షణ పొంది ఉద్యోగ అవకాశాలు పొందాలని అన్నారు. మాతృభాషను గౌరవించాలని కోరారు. జేసీఐ సికింద్రాబాద్, సికింద్రాబాద్ జూనియర్ ఛాంబర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సుమిత్ గోయల్, శత్రువేది వేటుకూరి, కే.వేణుగోపాల్, ప్రవర్తన కర్త గంప నాగేశ్వరరావు, ఎన్.సందీప్, బి.నాగశ్రీధర్, వి.ధీరజ్, జె.శిరీష్, జి.సుందర్ రాజ్, వరుణ్, టీ.శశిధర్, నాయకులు భానుకా మల్లిఖార్జున్, భాగ్యలక్ష్మీ, మారేడుపల్లి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



## అమ్మవారికి పూజలు

ఆదివారం మారేడుపల్లి న్యూ క్లబ్ ఆవరణలో గల నాగదేవత అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, క్లబ్ కమిటీ సభ్యులు. - మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి



రామచందర్‌రావును సత్కరిస్తున్న రెవరెండ్ కేపీ ఫాదర్ చార్లెస్ వెస్లీ

## అన్ని మతాల సమ్మేళనమే భారత్ గొప్పతనం

- చర్చి వార్షికోత్సవంలో రామచందర్‌రావు

**తిరుమలగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** హోలీ ట్రినిటీ చర్చి 179వ వార్షికోత్సవంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడుతూ మతాలకతీతంగా ప్రతీ ఒక్కరిలో సోదరభావం అవసరమన్నారు. అన్ని మతాల సమ్మేళనమే భారతదేశమని, అదే దేశం గొప్పతనం అన్నారు. కార్యక్రమంలో చర్చి రెవరెండ్ కెపి ఫాదర్ చార్లెస్ వెస్లీ, కార్యదర్శి సుందర్‌రావు, నవీన్, భాజాపా నేతలు వంశి తిలక్, ధనుంజయ చారి, జేవి నర్సింగ్‌రావు, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆయన బొల్లారంలోని అయ్యప్పస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని తెలిపారు.

## రజకుల సమస్యలను పరిష్కరించండి

**తార్నాక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వం రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆదివారం తార్నాకలోని ధోబీఘాట్‌లో జిల్లా సహాయ కార్యదర్శి రాపర్తి ప్రభాకర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి ఉపేందర్, సీఐటీయూ నాయకులు ఎం.అజయ్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు. అదేవిదంగా 50 సంవత్సరాలు నిండిన రజక వృత్తిదారులకు వృద్ధాప్య పెన్షన్, రూ.5 లక్షల బీమా సౌకర్యం, డబుల్ బెడ్‌రూమ్‌లలో మొదటి ప్రాధాన్యం కల్పించాలని, ఉచిత విద్యుత్ ఎల్‌టీ -2 నుంచి ఎల్‌టీ-4కు మార్చాలని, బీసీ రుణాలను వ్యక్తిగతంగా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ నగర కార్యదర్శి రాపర్తి అశోక్, జిల్లా నాయకులు సర్దార్ అశోక్, జ్యోతి దుర్గయ్య, జి. రమేష్, వి. మైసయ్య, సాలయ్య, హనుమంతు, తిరుపతి, పొన్న రాజు తదితరులు పాల్గొన్నారు.



తార్నాకలోని ధోబీఘాట్‌లో సమావేశమైన రజక వృత్తిదారుల సంఘం సభ్యులు



మట్టి గణపతుల తయారీలో పాల్గొన్న విద్యార్థులు

## మట్టి గణపతుల తయారీలో పోటీలు

**బేగంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** సనత్‌నగర్ మోడల్‌కాలనీలో సనాతన ధర్మబాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం విద్యార్థినీ విద్యార్థులకు మట్టి గణపతి తయారీ పోటీ లను నిర్వహించారు. పోటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని మట్టి గణపతులను తయారు చేసి, వాటికి సహజ రంగులను అద్దారు. ఈ సందర్భంగా సమితి సభ్యుడు బుచ్చిబాబు మాట్లాడుతూ, పిల్లల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు భగవంతునిపై భక్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. పోటీల్లో పాల్గొన్న పిల్లల్లో పది సంవత్సరాల పైబడిన వారు ముగ్గురు, అంతకంటే వయస్సు తక్కువగా ఉన్న వారిలో ముగ్గురిని ఎంపిక చేసి వారికి నగదు బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలకు మట్టిగణపతులను, జూట్ బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

## 143 డెకాయి ఆపరేషన్స్.. 70 మంది అరెస్ట్

- మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** మహిళలు, పిల్లల భద్రతకు షీ టీమ్స్ బృందాలు ప్రత్యేకంగా పనిచేస్తున్నాయి. సైబరాబాద్ పరిధిలో డెకాయి ఆపరేషన్స్ చేపట్టి మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న వారిపై దృష్టి సారిస్తున్నారు. గత వారం రోజుల వ్యవధిలో 143 డెకాయి ఆపరేషన్స్ నిర్వహించి అసభ్యకరమైన చర్యలకు పాల్పడుతున్న 70 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో పాటు 47 కేసులు నమోదు చేశామని సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వారికి న్యాయం చేసేలా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, వివిధ ప్రదేశాల్లో 75 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆమె పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో భార్యాభర్తలకు సంబంధించి సుమారు 34 కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారిని కలిపేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణా, పిల్లల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లలహక్కులు, బాలకార్మికులు, యాచించడం, సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వారం రోజుల్లో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించారని ఆమె వెల్లడించారు. మహిళా బాధితులు హెల్ప్‌లైన్ 181, పిల్లలకు సంబంధించిన సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు.



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు

## శాంతి భద్రతలను నెలకొల్పడంలో పీస్ కమిటీలది కీలకపాత్ర

- బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు

**బోయినపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) :** శాంతి భద్రతలను నెలకొల్పడంలో పీస్ కమిటీలది కీలకపాత్ర వహిస్తాయని బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు అన్నారు. వినాయక చవితి, మిలాద్- ఉన్ - నబి పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆదివారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీస్ కమిటీ సభ్యులతో బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బోయినపల్లి ప్రాంతంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి స్థానిక పోలీసులకు కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. పోలీసులు సమాజంలోని సభ్యుల సహాయ సహకారాలను తీసుకుని ముందుకు వెళ్లే సరైన పోలీసింగ్ అవుతుందన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పోలీసులకు మద్దతుగా ఉంటూ రాబోయే పండుగలు శాంతియుత వాతావరణంలో జరిగేలా కృషి చేస్తామని పోలీసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐలు శివశంకర్, గణేష్ గౌడ్, నందిత, అవినాష్, పీస్ కమిటీ సభ్యులు బండి శ్రీనివాస్, రాజు యాదవ్, రహమాన్, సతీష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ విక్రయాలపై ఎక్సైజ్ ఉక్కుపాదం

**పలు ప్రాంతాల్లో దాడులు కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం**

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** గంజాయి, డ్రగ్స్ విక్రేతలపై వరుస దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో కొకైన్, ఎండీఎంఏ విక్రయిస్తున్న మూడు ముఠాలను అరెస్ట్ చేశారు. నాంపల్లి రామ్‌కోట్ ప్రాంతానికి చెందిన మిస్బావుద్దీన్ ఖాన్(35), బంజారాహిల్స్‌కు చెందిన అలీ అస్గర్ గులాబీ (28)లు కొకైన్ తాగడానికి అలవాటు పడ్డారు. వీరు బెంగళూరుకు చెందిన మహ్మద్ అజీమ్ అనే వ్యక్తి నుంచి కొకైన్ కొని తాగేవారు. నగరంలో డ్రగ్స్ దొరకడం కష్టంగా మారడంతో వీరు బెంగళూరుకు వెళ్లి అజీమ్ నుంచి గ్రాము కొకైన్ రూ. 9వేలకు తెచ్చుకొని, నగరంలో పార్టీలు చేసుకునేవారు. బెంగళూరు వెళ్లి కొకైన్ తెచ్చుకునేందుకు నెల రోజుల క్రితం నగరానికి వచ్చిన అమెరికన్ సిటిజన్ జుబేర్ అలీ కారును తీసుకున్నారు. బెంగళూరు నుంచి కొకైన్ తీసుకొని నగరానికి వచ్చిన వీరి గురించి పక్కా సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది రామ్‌కోట్ ప్రాంతంలో వీరి కారును అడ్డుకున్నారు. మిస్బావుద్దీన్, అలీ అస్గర్, జుబేర్ అలీలను అరెస్ట్ చేసి వీరి నుంచి 33.3 గ్రాముల కొకైన్, 4 మొబైల్స్, ఇన్నోవా క్రిష్టా కారును స్వాధీనం చేసుకున్నారు.



నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న కొకైన్‌తో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం

**ఖాజాగూడ, శంషాబాద్ ప్రాంతంలో ఎండీఎంఏ..**

ఖాజాగూడ ప్రాంతంలో ఎండీఎంఏ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌టీఎఫ్ సిబ్బంది నిఘా పెట్టారు. ఎండీఎంఏ విక్రయించేందుకు యత్నిస్తున్న నాగుల్ల శివపనవర్, దేవట్ల మనోజ్, శ్రీవర్ధన్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి 2.07 గ్రాముల ఎండీఎంఏ, రెండు యాక్టివా బైకులు, మూడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరికి సరఫరా చేసే అలీ పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మరో కేసులో శంషాబాద్ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయాలపై నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఖయ్యుం నగర్‌కు చెందిన మిర్జాసైఫ్ అలీ, అత్తాపూర్‌కు చెందిన అబ్దుల్ అబిద్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద 5.88 గ్రాముల ఎండీఎంఏ లభించడంతో వారిద్దరిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు సయ్యద్ అబ్దుల్ హసన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.



## మట్టి గణపతుల పంపిణీ

వినాయక పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మీయ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ డా.లక్ష్మరాజు నిర్మల నరసింహారావు దంపతులు ఆదివారం తార్నాకలోని ఆత్మీయ కార్యాలయం ఆవరణలో పర్యావరణంపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి